సాక్షి కర్నూలు

మంగళవారం । 28 । నవంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన టి.శ్రీకాంత్, కుటుంబసభ్యులు రూ.2,00,000 విరాళంగా అందజేశారు.



సుంకేసులకు పెరిగిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శ్రీశైలానికి 1,824, కేసీ కాల్వకు 2,354 క్యూసెక్కులను వదిలారు.



దరఖాస్తుల వెల్లువ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ ల్లో పలు పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు అభ్యర్థుల నుంచి భారీగా స్పందన వస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నేడు శంకుస్థాపన

- వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు ట్రాన్స్‌కో 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఈ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం ముత్యాలపాడు వద్ద రూ.138.59 కోట్లు, పాణ్యం నియోజకవర్గం గడివేముల వద్ద రూ.98.65 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గం బనవాసి వద్ద రూ.148కోట్లతో ఈ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

మిర్చి క్వింటా రూ.22,713

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఎండుమిర్చి క్వింటా రూ.22,713 ధర పలికింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చికి సంబంధించి ఇప్పుడిప్పుడే దిగుబడులు మొదలయ్యాయి. కర్నూలు మార్కెట్‌కు మిర్చి పంట రావడం కూడా క్రమంగా పెరుగుతోంది. సోమవారం 251 క్వింటాళ్లు రాగా క్వింటా కనిష్ట ధర రూ.3,599, గరిష్ట ధర రూ.22,713 నమోదైంది. మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటం రైతుకు ఊరటనిస్తోంది.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 30 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఫెయిల్ అయిన ప్రైవేటు విద్యార్థులందరూ జరిమానా లేకుండా ఈనెల 30వ తేదీలోగా ఫీజులు చెల్లించవచ్చని ఆర్ఐఓ గురువయ్యశెట్టి సోమవారం తెలిపారు.



కర్నూలు ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



మంత్రాలయంలో తుంగభద్ర నదికి నక్షత్ర హారతులు పడుతున్న శ్రీమఠం అర్చకులు

దీపం.. దివ్యతేజం

- మంత్రాలయంలో కన్నుల పండువగా తుంగా హారతి
- టీటీడీ ఆధ్వర్యంలో కర్నూలులో ఘనంగా కార్తీక దీపోత్సవం



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు



నదీమతల్లికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం/ కర్నూలు కల్చరల్: కార్తీక పౌర్ణమి వేళ మంత్రాలయం, కర్నూలులో దీపోత్సవాలు కన్నుల పండువగా సాగాయి. పండితుల మంత్రోచ్ఛారణలు.. భక్తజన కోలాహలం.. దీపాకాంతుల మధ్య మంత్రాలయంలో తుంగాతీరం శోభాయమానంగా కనిపించింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో లక్ష దీపోత్సవం, తుంగానది పుణ్య హారతి కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ముందుగా ఊంజల మంటపంతో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు పీఠాధిపతి అంకురార్పణ పలికారు. అనంతరం బాజాభజంత్రీలు, మేళాతాళాలు, భజన, కోలాటాల బృందాలతో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు ఊరేగింపుగా తుంగభద్ర నది తీరానికి చేరుకున్నారు. నదీమతల్లికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు పట్టారు. సభా వేదికపై ఆశీనులైన ప్రహ్లాదరాయలకు హారతి చేపట్టి లక్ష దీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. పీఠాధిపతి సమక్షంలో అర్చకులు తుంగభద్రమ్మకు శాస్త్రోక్తంగా కార్తీక నక్షత్ర హారతులు పట్టారు. భక్తులు పుష్కరఘాట్లపై కార్తీక దీపాలను వెలిగించి వేడుకలో తరించారు. శ్రీహరి శంకుచక్ర, నామాలు, శివలింగాలు, సుదర్శన చక్రాల రూపాల్లో ముగ్గులు వేసి ఆడపడచులు కార్తీక జ్యోతులు వెలిగించారు. తుంగాతీరమంతా బంగారు వర్ణ శోభితమై కాంతులీనింది. ఈ సందర్భంగా పీఠాధిపతి కార్తీక మాస విశిష్టతను భక్తులకు ప్రవచించారు. అజ్ఞాన తిమిరాలను తొలగించుకునేందుకు ప్రతి భక్తుడూ కార్తీక మాస పవిత్రను ఆచరించాలని సూచించారు. నదులకు పుణ్యహారతి సంస్కృతిని శ్రీమఠం ఆచరణలోకి తీసుకురాగా.. వివిధ పుణ్యక్షేత్రాల్లో ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో పుణ్య నదుల హారతులు విధానం అమల్లోకి తెచ్చిందన్నారు. వేడుక సందర్భంగా విద్వాంసుడు సంప్రతి మోహన్ దాసవాణి భక్తులకు వీనుల విందు చేసింది. కర్ణాటక వాసుల కోలాటాలు, హరిదాసుల నర్తనలు, భజనలు అలరించాయి. వేడుకలో బన్నంజె మఠం పీఠాధిపతి రాఘవేంద్ర తీర్థ స్వామిజీ, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

కర్నూలులో..



శ్రీ వెంకటేశ్వరస్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కర్నూలు ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమం కన్నుల పండువలా జరిగింది. భారీ సంఖ్యలతో తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు. తిరుపతి రాయలచెరువు శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని అనుగ్రహ భాషణం చేశారు. శ్రీనివాచార్చన, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గోవింద నామాలను వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఐదు క్రీడాంశాల్లో 'ఆడుదాం- ఆంధ్ర'

- ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



క్రికెట్ బ్యాట్లు అందజేస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు (టౌన్): ఆడుదాం- ఆంధ్ర పేరుతో డిసెంబర్ 15 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లాలో ఐదు అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతలో క్రీడాస్ఫూర్తిని రగిలించేందుకు, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు, మండల స్థాయిలో జనవరి 2 నుంచి 15వ తేదీ వరకు, నియోజకవర్గస్థాయిలో జనవరి 16 నుంచి 21 వరకు, జిల్లా స్థాయిలో జనవరి 22 నుంచి 28 వరకు, రాష్ట్ర స్థాయిలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి3 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో క్రీడల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. యోగా, టెన్నికాయిట్, మారథాన్ క్రీడాంశాల్లోనూ పోటీలు ఉంటాయని చెప్పారు. సోమవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. క్రీడా సామగ్రిని ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించిందని, వారంలోపు అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు చేరుస్తామన్నారు. ఇప్పటికే క్రీడలు నిర్వహించే మైదానాలను మ్యాపింగ్ చేశామన్నారు. పది రోజుల్లో క్రీడా మైదానాలను సిద్ధం చేస్తామన్నారు. క్రీడలు నిర్వహించే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామన్నారు. 50 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసు వ్యవస్థను కూడా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. క్రీడా పోటీల్లో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం ఆడుదాం- ఆంధ్ర మాస్కట్ లోగో, పోస్టర్లు అవిష్కరించారు. సమావేశంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, డీఈఓ రంగారెడ్డి, జిల్లా పరిషత్తు సీఈవో నాసర రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

సంగ్రహణాత్మకం.. పెరగనున్న సామర్థ్యం

- నేటి నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 4.38 లక్షల మంది విద్యార్థులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్పు చేసి విద్యా రంగంలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సామర్థ్యాలను సైతం అదే స్థాయిలో పెంచేందుకు చర్యలు చేపట్టింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసింది. నేటి(మంగళవారం)నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆయా మండల విద్యా వనరుల కేంద్రాలకు చేర్చాలి. కానీ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ఏ-1 పరీక్షల గురించి కానీ, ఆ పరీక్షల నిర్వహణను ఏ మాత్రం పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా సాధారణ పరీక్షల విభాగం అధికారులు పరీక్షల నిర్వహణను ఏ మాత్రం పట్టించుకోకుండా తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలను పంపిణీ చేస్తుండటం విశేషం. 1 నుంచి 9వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ప్రశ్నపత్రాలు ఉంటాయి. 10వ తరగతి విద్యార్థులకు మాత్రం ఎంపిక చేసుకున్న మీడియంలోనే ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలకు విద్యాశాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైన లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే విధంగా చర్యలు చేపట్టారు.

ఎప్పటిలాగే పరీక్షలు..

జిల్లాలో 2,251 పాఠశాలల్లో చదువుతున్న 4.38 లక్షల మంది విద్యార్థులు సంగ్రహణాత్మక పరీక్షలు రాయనున్నారు. గతేడాదిలాగే ఈ ఏడాది కూడా ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకోనున్నారు. మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేటట్లు షెడ్యూల్ ఇచ్చారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ఎఫ్ఏ-3, మార్చి నెలలో ఎఫ్ఏ-4, పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు, ఏప్రిల్ నెలలో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సంగ్రహణాత్మక పరీక్ష(ఎస్ఏ-2)నిర్వహించనున్నారు.

టోఫెల్‌కు ప్రశ్నపత్రాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఉన్న స్కూళ్లలో మాత్రమే నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి ప్రతి స్కూల్‌కి ప్రింటెడ్ ప్రశ్నపత్రాలను ఎస్‌సీఈఆర్‌టీ పంపిణీ చేసింది. సాధారణ పరీక్షల వలే టోఫెల్ పరీక్షను కూడా ప్రశ్నపత్రాలలో రాయనున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

- 1-5 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లిష్, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లిష్ పార్ట్-బీ టోఫెల్ పరీక్ష
- 6-10 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లిష్, 4న గణితం
- డిసెంబర్ 5న 6-7 తరగతులకు జనరల్ సైన్స్, 8-10 తరగతులకు పీఎస్
- డిసెంబర్ 6న 8-10 తరగతులకు బీఎస్, 7న సోషల్ స్టడీస్, 8న ఇంగ్లిష్ పార్ట్-బీ టోఫెల్ పరీక్ష

పరీక్ష సమయం

- 1-5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
- 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు

ప్రశ్నా పత్రం మార్కులు

- 1-8 తరగతులకు 80 మార్కులు, 9, 10 తరగతులకు 100 మార్కులు

పకడ్బందీగా నిర్వహించాలి

ఎస్ఏ-1 పరీక్షలు డీసీఈబీ ద్వారానే జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రశ్నపత్రాలు దాదాపు అన్ని మండల కేంద్రాలకు చేరాయి. వీటిని సంబంధిత ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలి. తప్పులు జరిగితే సంబంధిత స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయి.

– డాక్టర్ వి. రంగారెడ్డి, డీఈఓ

గుండెకు మరింత ధైర్యం

- కర్నూలు పెద్దాసుపత్రిలో నూతన క్యాథలాబ్ మిషన్
- నేడు ప్రారంభించనున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన క్యాథలాబ్ మిషన్

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బులను గుర్తించే నూతన క్యాథలాబ్ మిషన్ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సిద్ధమైంది. దీనిని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిచే ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో క్యాథలాబ్ ఏర్పాటు చేశారు. ఈ మిషన్‌తో పాటు అప్పట్లోనే హార్ట్ లంగ్ మిషన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. దాదాపు 15 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ఆ యంత్రం పని చేసింది. అది మరమ్మతుకు గురికావడంతో దాని స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అధునాతన కేథలాబ్‌ను రూ.6కోట్లతో మంజూరు చేసింది. రక్తనాళాలు, హృదయ సంబంధిత సమస్యలను నిర్ధారించి, చికిత్స నిర్వహించడంలో క్యాథలాబ్ మిషన్ కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ దలచుకున్న ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్(ఈసీసీ) కార్యక్రమంలో క్యాథలాబ్ సౌకర్యం ఉన్న కర్నూలు బోధనాసుపత్రి హబ్‌గా వ్యవహరించనుంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం.. క్యాథలాబ్ మిషన్‌తో పాటు రూ. 2.5 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్‌ను, నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంకును సైతం ప్రారంభించనున్నారు. అనంతరం ఆ బ్లాక్‌లో ఏర్పాటైన వివిధ విభాగాలను సందర్శించనున్నారు. ఆయనతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు.

ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి



మేం పేదలం. మాకు ఇల్లు లేదు. మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. ఇల్లు కట్టుకోవడానికి అనుమతి కూడా వచ్చింది. ఇంటి నిర్మాణం మొదలు పెట్టాం. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 1.60లక్షల వరకు బిల్లు ఇచ్చింది. బాత్ రూం బిల్లు రూ. 12వేలు వరకు మాత్రమే రావాల్సి ఉంది. పేదలకు మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి. అలాంటప్పుడే నాలాంటి పేదలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుంది. – బుడేకల్ గణేష్, పాదలకుంట, కౌతాళం మండలం



జీవనోపాధి మెరుగుపడింది

మాది పేద కుటుంబం. నా భర్త మల్లికార్జున 12 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కూలి పనులు చేస్తూనే పిల్లల్ని చదివించాను. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు తీరాయి. వైఎస్సార్ చేయూత పథకం కింద ఇచ్చిన నగదుతో ఆలూరు ఎంపీడీఓ ఆఫీసు ఎదుట బీడీ కొట్టు పెట్టుకున్నా. డ్వాక్రా రుణమాఫీ, స్త్రీ నిధి, జీరో వడ్డీ పథకాలు మమ్మల్ని ఆదుకున్నాయి. నెలకు రూ. 6 వేలు తక్కువ కాకుండా ఆదాయం వస్తోంది. జీవనం సాగిస్తున్నాను. చేయూత పథకంతో జీవనోపాధి మెరుగుపడింది. – శారదమ్మ,ఆలూరు గ్రామం



తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

- వచ్చిన ప్రతి ఫిర్యాదుపై విచారణ జరపాలి
- ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి
- రాజకీయ పార్టీల సహకారం తీసుకోవాలి
- ఓటరు జాబితా పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సృజన



హాజరైన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, రాజకీయపార్టీల ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలను ఓటరు జాబితా పరిశీలకులు, ఏపీఎంఎస్ఐడీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. ముసాయిదా జాబితాపై వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై ఆయన కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షకు కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ బీటీనాయుడు, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు జరగాలన్నారు. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ఫారం-6, 7, 8లపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. ఓటర్ల నమోదులో కర్నూలు జిల్లా రాష్ట్ర సరాసరికంటే తక్కువగా ఉందని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించించారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. జిల్లాలో పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు పక్కగా డాక్యుమెంటేషన్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 18-19 ఏళ్ల మధ్య ఉన్న వారిని ఓటర్లు చేర్పించేందుకు కాలేజీలు, సినిమా హాళ్లలో విస్తృతంగా ప్ర చారం చేపట్టినట్లు వివరించారు. వచ్చిన అన్ని ఫిర్యాదులపై డిసెంబర్ 9లోపు విచారణచేస్తామని ఆమె వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు జాన్ విల్సన్, సీపీఎం నాయకుడు దేశాయ్, బీఎస్పీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్తీక కాంతులు


పగిడ్యాల: లింగాకృతిలో వెలిగించిన దీపాలు


మంత్రాలయం: వేడుకలు తిలకిస్తున్న భక్తులు


ఉత్సవమూర్తికి హారతిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి


మంత్రాలయం: తుంగభద్ర నదీతీరంలో దీపోత్సవ దృశ్యం


శ్రీశైలం: క్యూలైన్లలో భక్తుల రద్దీ


కొత్తపల్లి: సంగమేశ్వరంలో భక్తుల సందడి


విద్యుత్ దీపకాంతులలో స్వామి అమ్మవార్లు, కార్తీక పౌర్ణమి చంద్రుడు

కార్తీక రెండో సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. దీపారాధనతో ప్రముఖ క్షేత్రాలు శోభిల్లాయి. పౌర్ణమి ఘడియలు మధ్యాహ్నం వరకు ఉండటంతో భక్తులు నదులు, కాలువల్లో దీపాలు వదిలి భక్తిభావాన్ని చాటుకున్నారు. శివునికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలుచోట్ల లక్ష దీపోత్సవాలను కన్నుల పండువగా జరిపారు. జ్వాలాతోరణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రాలయం, శ్రీశైలంలో వేడుకలు వెలుగులీనాయి.

–సాక్షినెట్‌వర్క్


కర్నూలు: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, ఎస్పీ కృష్ణకాంత్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు


వెలుగోడు: వేల్పనూరులో జ్వాలాతోరణోత్సవం


ఆస్పరి: లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


హొళగుంద: సాయిబాబా మందిరంలో దీపోత్సవం


యాగంటిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అతి పెద్ద యువజన విభాగం ఎన్‌సీసీ

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలోనే అతిపెద్ద యువజన విభాగం ఎన్‌సీసీ అని నైన్ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండర్ కల్నల్ జోబి ఫిలిప్ పేర్కొన్నారు. 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నైన్ ఆంధ్ర ఎన్‌సీసీ బాలికలు కర్నూలు నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో సోమవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్నల్ జోబి ఫిలిప్ మాట్లాడుతూ.. దేశానికి ఎన్‌సీసీ విద్యార్థులు మూలస్తంభాలన్నారు. రక్తదానం ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడుతుందన్నారు. దేశ ప్రజల ఐక్యతను చాటే విధంగా ఎన్‌సీసీ అభ్యర్థులు స్వచ్ఛంద కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, ఎన్‌సీసీ 9 ఆంధ్ర ఆఫీసర్లు ఎస్‌కే కోటి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న క్యాడెట్‌ను అభినందిస్తున్న కల్నల్ జోబి ఫిలిప్



'స్పందన' అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో భాగంగా జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలకు సరైన ఎండార్స్‌మెంట్ ఇస్తే రీ ఓపెన్ కాబోవన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారాలు చూపితే అసంతృప్తి శాతం తగ్గే అవకాశం ఉందన్నారు.

నోడల్ అధికారులుగా పనిచేయాలి..

ఎన్నికలకు సంబంధించి మ్యాన్ పవర్, మేనేజ్‌మెంట్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్, వెహికల్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర విభాగాల్లో నోడల్ అధికారులుగా పనిచేయడానికి అధికారులు ముందుకు రావాలన్నారు. ఒక్కో విభాగంలో రెండు, మూడు శాఖల అధికారులు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వారం రోజులలోపల నియామక ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు కాకుండా ముందుగా పీఓ, ఏపీఓ, ఓపీఓలను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

ఆరోగ్యశాఖ పోస్టులకు దరఖాస్తుల వెల్లువ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి వైద్యశాలల్లో పలు పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు అభ్యర్థుల నుంచి భారీగా స్పందన వస్తోంది. దరఖాస్తుకు శనివారం చివరి రోజుగా నిర్ణయించిన అధికారులు అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో 29వ తేదీ వరకు గడువు పెంచారు. దీంతో సోమవారం సైతం అభ్యర్థులు భారీ సంఖ్యలో కర్నూలు మెడికల్ కాలేజీకి దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చారు. శనివారం నాటికి 3,460 మంది దరఖాస్తు చేయగా సోమవారం ఒక్కరోజే 3 వేలకు పైగా అభ్యర్థులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థుల రద్దీ ఎక్కువ కావడంతో సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మిగిలిన వారిని మంగళవారం రావాలని పంపించి వేశారు.


దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన అభ్యర్థులు

గుడిసె దగ్ధం.. రూ.6 లక్షల ఆస్తి నష్టం

- బూడిద పాలైన పెళ్లి సామగ్రి


దేవనకొండ: స్థానిక ఎస్సీ కాలనీలో ఎద్దు రంగమ్మకు చెందిన గుడిసె సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యింది. రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. నలుగురు కుమారులు సొంత గృహాలు నిర్మిస్తుండటంతో రంగమ్మ ఖాళీ ప్రదేశంలో గుడిసె వేసుకొని అందులో నలుగురికి సంబంధించిన వస్తువులు, ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే డబ్బు దాచుకున్నారు. పెద్ద కుమారుడు ఎద్దు రామాంజనేయులు స్థానికంగా దేవనకొండలోనే ఉంటూ ఇంటి నిర్మాణం పనులు, జీవనోపాధి కోసం కూలీ పనులు చేస్తుండేవాడు. మిగిలిన ముగ్గురు ఇంటి నిర్మాణం కోసం అయ్యే ఖర్చుల కోసం సంపాదించడానికి వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇంటి నిర్మాణం కోసం నాలుగు రోజుల క్రితం రూ.3 లక్షలు దాకా డబ్బు తెచ్చి ఇంటిలోని బీరువాలో దాచుకున్నారు. వీరి సోదరికి త్వరలో పెళ్లి నిశ్చయించుకున్నారు. పెళ్లి కోసం తెచ్చిన బంగారు, వెండి, దుస్తులు కూడా బూడిద పాలయ్యాయి. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పొలం, ఇంటి డాక్యుమెంట్లు అన్ని బూడిద పాలయ్యాయి. కట్టుబట్టలతో నడి రోడ్డు మీద నిలిచే పరిస్థితి వచ్చిందని బాధితులు కంటతడి పెట్టుకున్నారు.


కాలిబూడిదైన గుడిసె

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- స్పందనలో ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

కర్నూలు: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఫార్మాసిస్టు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అశ్విని సాయిగ్రీన్ సిటీ బి–బ్లాక్‌లో నివాసముంటున్న లావణ్య రూ.4.80 లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేశారని కల్లూరు మండలం షారుక్ నగర్‌కు చెందిన కార్తీక్ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. తాను అమ్మా హాస్పిటల్‌లో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నానని, తరచూ హాస్పిటల్‌కు వస్తూ తనతో పరిచయం పెంచుకుని ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశారని ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో కార్తీక్ పేర్కొన్నారు. కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఐసీఐసీఐ బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి కాల్ చేస్తున్నానని సంభాషణ చేస్తూ తన క్రెడిట్ కార్డు నుంచి రూ.1.38 లక్షలు గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేసుకున్నారని కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ అలీ ఫిర్యాదు చేశారు.
- తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో రూ.3 లక్షలు ఖర్చు పెట్టి పత్తి పంట వేయగా కార్తిక్, అశోక్ అనే వ్యక్తులు ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారని, విచారణ జరిపించి న్యాయం చేయాలని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన నరేష్ కోరారు.
- పెద్ద కుమారుడు శేఖర్ బాబు తనకు తెలియకుండా తన పేరున ఉన్న పొలాన్ని తన కుమార్తె పేరుతో అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని మోసం చేశాడని కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన కేశమ్మ ఫిర్యాదు చేశారు.